మాచారెడ్డి సొసైటీలో ఎరువుల కొరత

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేదంటున్న రైతులు

మాచారెడ్డి, డిసెంబర్ 27 : మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని 33 గ్రామాలకు ఒకే సొసైటీ మాచారెడ్డిలో ఉన్నది. యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి మాచారెడ్డి మండలంలో వరి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. వరి నాట్లు వేయడానికి సిద్ధమవుతున్న రైతులకు 20-20, డీఏపీ ఎరువులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంటల సాగుకు సిద్ధమైన సమయంలో ఎరువులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఎక్కువ ధరకు కొనాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల నుంచి ఎరువులు వస్తున్నాయని సొసైటీ, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ.. అవి రావడం లేదు. సొసైటీలో లభించని ఎరువులు బయట ప్రైవేట్‌గా విచ్చలవిడిగా ఎక్కువ ధరలకు ఏవిధంగా విక్రయిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత ఉండేదికాదు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేవని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. రైతుబంధు డబ్బులు కూడా బ్యాంకు ఖాతాలో పడేవన్నారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు కావాల్సిన ఎరువుల ను వెంటనే తెప్పించాలంటున్నారు. రైతులకు అవసరం ఉన్న ఎరువులను గ్రామాలకు పంపించాలని కోరుతున్నారు.

మాచారెడ్డి సొసైటీ కార్యాలయం

కేసీఆర్ హయాంలో సకాలంలో అందేవి

గత కేసీఆర్ ప్రభుత్వ హయంలో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేవి. కానీ ఇప్పుడు మాచారెడ్డి సొసైటీలో ఎరువులు లేవని, సొసైటీ కార్యాలయం చుట్టు తిప్పిస్తున్నారు. మా గ్రామంలో నాతోపాటు చాలా మందికి బీస్-బీస్, డీఏపీ ఎరువులు అందకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్దకు అధిక ధరకు కొనుగోలు చేశాం.

- బట్ట రమేశ్, అక్కాపూర్, మాచారెడ్డి మండలం

ఎరువులు లేక ఇబ్బందిగా ఉంది

పదిహేను రోజుల నుంచి ఎరువుల కోసం ఎదురు చుస్తున్నాం. సమయానికి పెట్టుబడి (రైతుబంధు)కి డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు డీఏపీ ఎరువులు అందించాలని వేడుకుంటున్నాం.

- ఆశన్నగారి రమేశ్, భవానీపేట, పాల్వంచ మండలం

స్ట్రీట్ లైట్‌కు అడ్డంగా పెరిగిన చెట్లు

చెట్టు మధ్యలో ఉన్న విద్యుత్ వైర్లు

స్ట్రీట్ లైటుకు అడ్డంగా పెరిగిన చెట్టు

కామారెడ్డి, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో ఉన్న ఆర్‌బీనగర్‌లో స్ట్రీట్ లైట్‌కు అడ్డంగా పెద్దగా చెట్లు పెరడగంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం పూట లైట్లు వేసిన తర్వాత చెట్లు ఉండడంతో వెలుతురు సరిగా రావడంలేదు. చిన్నారులు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. కాలనీల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయని, అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని కాలనీ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో స్ట్రీట్ లైట్లకు అడ్డంగా ఉన్న చెట్లు, రోడ్లపై అడ్డంగా పెరిగిన మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా జిల్లా కేంద్రంలోని ప్రతి కాలనీలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. స్వచ్ఛతపై గొప్పలు చెప్పుకోవడం తప్ప కాలనీల్లో మాత్రం స్వచ్ఛత లేదని కాలనీ వాసులు అంటున్నారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి

కామారెడ్డి, డిసెంబర్ 27 : నల్లగొండ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు జిల్లా నుంచి తరలిరావాలని అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకుడు నరసింహారావు, జిల్లా కోశాధికారి రూప్‌సింగ్, కార్యదర్శులు సాయిగౌతమ్, బాల య్య, నాంపల్లి శ్రీహరి, నరేందర్, రత్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భిక్కనూరు, డిసెంబర్ 27 : భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల (బాలుర) కళాశాలలో టీజీటీ మాథ్స్ సబ్జెక్టు ఇంగ్లిష్ మీడియంలో బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘు తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే డెమో ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. బీఈడీ, పీజీ అర్హతలున్నా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 27: భారతదేశ మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ మృతికి జిల్లావ్యాప్తంగా నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం నివాళులర్పించారు. రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్, యూజీసీ చైర్మన్, కేంద్ర ఆర్థిక మంత్రి, ప్రధాన మంత్రిగా ఆయన దేశానికి చేసిన గుర్తు చేసుకున్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలో ఆయన చూపిన చొరవ ఎన్నటికీ మరువలేదనిదన్నారు. ఎల్లారెడ్డితోపాటు మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో, నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద, జుక్కల్, కామారెడ్డి, నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాన్సువాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, గాంధారి మార్కెట్ కమిటీ ఆవరణలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ ఆర్థిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని కొనియాడారు.

మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ వైర్మన్ కాసుల బాలరాజు

వాహనాల తనిఖీ

బీబీపేట్, డిసెంబర్ 27 : బీబీపేట మండలంలోని శ్రీగాధ రోడ్డు వద్ద ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, పోలీస్ సిబ్బంది శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని 25 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీరాం, రమేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నస్రుల్లాబాద్, డిసెంబర్ 27 : బీర్కూర్‌కు చెందిన యామ హరి ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి స్నేహితులు శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. గంగరాజు, శివాజీ, కృష్ణ, రాజు, ప్రశాంత్, తరుణ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయ్ పాల్ రెడ్డి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు మొక్కను బహూకరిస్తున్న గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 27 : కామారెడ్డి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయపాల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగాకలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. విజయపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని రాజీవ్ స్వగృహంలో పని చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి స్రవంతి

తాడ్వాయి(లింగంపేట), డిసెంబర్ 27: తాడ్వాయి మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం పోలీసులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు కలిసి ఓ బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికకు వివాహం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకున్నారు. అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేయడంతో కలిగే అనర్థాలను వివరించారు. బాలికను జిల్లాకేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో ఐసీపీఎస్ కార్యకర్త వీణ, ఏఎస్సై కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు సంజన

గాంధారి, డిసెంబర్ 27: జాతీయ స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని పొతంగల్ కలాన్ గ్రామానికి చెందిన సంజన ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్ శుక్రవారం తెలిపారు. మెదక్ జిల్లాలో అక్టోబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొన్న సంజన విశేషంగా రాణించడంతో నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సంజనను షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయి కుమార్‌తోపాటు, బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు సేవంతా రాథోడ్, గుగులోత్ సురేందర్ తదితరులు అభినందించారు.

బోరుమోటర్ల విద్యుత్ బిల్లుల వసూలు

సోమార్‌పేట్‌లో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న లైన్‌మన్ బాలకిషన్‌గౌడ్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 27: మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో శుక్రవారంతో వందశాతం వ్యవసాయ మోటర్ల విద్యుత్ బిల్లులు వసూలు అయినట్లు లైన్‌మన్ బాల్‌కిషన్‌గౌడ్ తెలిపారు. గ్రామంలోని రైతులకు విద్యుత్ బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించామన్నారు. గ్రామంలో మొత్తం 79 మంది రైతులు పొలాల వద్ద వ్యవసాయ మోటర్ల కోసం విద్యుత్ కనెక్షన్లు కలిగి ఉన్నారని, వారి నుంచి 35వేల 288 రూపాయల విద్యుత్ బిల్లులు వసూలు చేసినట్లు తెలిపారు. వందశాతం బిల్లుల చెల్లింపునకు సహకరించిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు అసిస్టెంట్ లైన్‌మన్ ఇస్మాయిల్, సీఎల్ రియాజ్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే 65శాతం పూర్తి

లింగంపేట, డిసెంబర్ 27: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే 65 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. 41 పంచాయతీల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇండ్ల కోసం 12,179 దరఖాస్తులు వచ్చాయని, శుక్రవారం వరకు 7,916 దరఖాస్తుల సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. మండలంలోని మెంగారం, అయ్యపల్లి, శెట్పల్లి, భవానీపేట, మోతె, లింగంపేట, పోల్కంపేట, కోమట్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం సర్వే చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్వే పూర్తిచేసిన దరఖాస్తుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో వివరించారు.

లింగంపేటలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది

★నేను కవాట్‌వార్ మల్లాజీ తండ్రి కవాట్‌వార్ హూల్లజి దోంగ్లి గ్రామ నివాసిని, 1987వ సంవత్సరములో ఈరయ్య అనే వ్యక్తి దగ్గర నుండి సర్వే నెంబర్.213/1లో విస్తీర్ణం 0.0250 గుంటల గొటన్ భూమిని విక్రయ దాస్తవేజు నెంబర్ 367/1987 ద్వారా బిచ్కుంద సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. బిచ్కుంద నుండి దోంగ్లి బస్సులో వెళ్తున్నప్పుడు నా యొక్క 367/1987 కి సంబంధించిన ఒరిజినల్ దస్తవేజు పోయింది. కావున నా యందు దయతలచి దీని ఆచూకి తెలిసినవారు ఈ క్రింది నంబర్లకు సంప్రదించగలరు.
1) కావట్‌వార్ మల్లాజీ సెల్ నెం.9705884008
2) కావట్వార్ విట్టల్ సెల్ నెం.9440679088
NTZ-334434

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్; డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337305

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

డంప్.. కాదు కంపు

డంపింగ్ యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 27: మండల కేంద్రం గోపాల్‌పేట శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కంపు కొడుతున్నది. మూడు నెలలుగా డంపింగ్ యార్డులో వేస్తున్న చెత్తను తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తున్నది. దీనికితోడు మటన్ దుకాణాలు, చికెన్ సెంటర్ల నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలను అందులో వేస్తున్నారు. కుక్కలు మటన్, చికెన్ వ్యర్థాలను రోడ్ల పైకి తీసుకు వస్తున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకొని, కోదండ రామాలయానికి సమీపంలో వదల్పర్తి రోడ్డు పక్కనే డంపింగ్ యార్డు ఉన్నది. దీంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు డంపింగ్ యార్డు నుంచి వచ్చే వాసనను భరించలేకపోతున్నారు. తడి, పొడి చెత్త సేకరణ ఎలా ఉన్నా.. ఇక్కడి వ్యర్థాల విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గోపాల్‌పేట డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త

పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 27: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ, అధ్యాపకుల నియామకం కోసం అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్ జేఎల్, ఇంగ్లిష్ పీజీటీ, ఫిజికల్ సైన్స్ పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50శాతం మార్కులను కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు నేరుగా ఈనెల 30వ తేదీన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704550260 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 27: ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలను చేపట్టినట్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీ బృందం, డీఆర్పీలు, సంబంధిత ఎస్ఆర్పీల ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు తనిఖీలు చేసి, నివేదిక తయారు చేసినట్లు తెలిపారు. దీంతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రత్యేకాధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ సమక్షంలో ప్రజావేదిక నిర్వహించి, తనిఖీ బృందం నివేదికను సమర్పిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగంపేట, డిసెంబర్27: మండలంలోని లింగంపల్లి గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన వడ్ల కృష్ణమూర్తి తన ద్విచక్ర వాహనంపై లింగంపేట నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. ఆయన నడుపుతున్న బైక్ అదుపుతప్పి పాములవాగులోకి దూసుకెళ్లడంతో కిందపడ్డాడని తెలిపారు. దీంతో అతడి చేయి విరగడంతోపాటు తలకు గాయాలయ్యాయని, 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరేందర్‌గౌడ్

లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న నరేందర్‌గౌడ్

లింగంపేట, డిసెంబర్ 27: తెలంగా ణ తహసీల్దార్ల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడి గా లింగంపేట తహసీల్దార్ నరేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. కామారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో అతడిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, జేఏసీ వైర్మన్ లచ్చిరెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఆయన నరేందర్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం తెలంగాణ తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు ను కలిశారు. ఆయన వెంట పలువురు తహసీల్దార్లు ఉన్నారు.

ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేస్తానని మోసం

కామారెడ్డి, డిసెంబర్ 27 : ఏటీఎం నుంచి డబ్బులు చోరీ చేసిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన సిరిసిల్ల రాజు అనే వ్యక్తి సిరిసిల్ల రోడ్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంకు డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా డబ్బులు రాలేదు. అతని వెనుకాలే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తాను డబ్బులు తీసి ఇస్తానని ఇతని ఏటీఎం కార్డు తీసుకున్నాడు. డబ్బులు రావడం లేదని మరో ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత రాజు ఫోన్‌కు డబ్బులు డ్రా అవుతున్నట్లుగా మెసేజ్‌లు రావడంతో వెంటనే బ్యాంక్‌కు వెళ్లి కార్డు బ్లాక్ చేయించాడు. మొత్తం రూ.40 వేల వరకు డ్రా అయినట్లుగా గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.